క్లుప్తంగా

జాతర పోస్టర్ ఆవిష్కరణ

పెంచికల్‌పేట్: రెబ్బెన మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న శ్రీ స్వయంభూ దుర్గాదేవి మహంకాళి అమ్మవారి జాతర పోస్టర్‌ను మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సంజీవ్, సుధాకర్, యువకులు పాల్గొన్నారు.

'మంత్రివర్గంలో చోటు కల్పించాలి'

కౌటాల: రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణలో మాల సామాజిక వర్గానికి చోటు కల్పించాలని ఆల్ ఇండియా కాన్ఫడరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ, మైనార్టీస్ ఆర్గనైజేషన్ జిల్లా కన్వీనర్ డోంగ్రే మానిక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రాధాన్యతలో భాగంగా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం మాలల సమస్యలను పరిష్కరించాలన్నారు.

నేడు 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్'



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అవగాహన ర్యాలీ..

ఆసిఫాబాద్‌రూరల్: జై బాపు జై భీం జై సంవిధాన్ పాదయాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని గోవింద్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు నాయకులతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు బాలేశ్వర్ గౌడ్, చరణ్, మల్లేశ్, దత్తు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


'నర్సరీలోని మొక్కలను కాపాడాలి'



నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ఈసీ

కెరమెరి: మండుటెండల నుంచి మొక్కలను కాపాడాలని ఈజీఎస్ ఈసీ అక్కానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నర్సరీని పరిశీలించారు. సరిగా మొక్కల్లో జర్మినేషన్ అయ్యే విధంగా చూడాలన్నారు. ప్రతిరోజు మూడు సార్లు నీరు పోయాలన్నారు. పిచ్చిమొక్కలు పెరగకుండా ఎప్పటికప్పుడు కలుపుతీస్తూ ఉండాలని అప్పుడే మొక్కల్లో ఎదుగుదల ఉంటుందని పేర్కొన్నారు. టీఏ అరవింద్ ఉన్నారు.

కలెక్టర్ దృష్టికి పాటగూడ సమస్యలు



గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు

కెరమెరి: మండలంలోని పాటగూడ గ్రామంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని మానవహక్కుల కమిటీ చైర్మన్ రాథోడ్ రమేశ్ అన్నారు. గ్రామస్తులు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. తాగునీటి వసతి, చేతిపంపులు, బావులు, మిషన్ భగీరథ పనితీరు తదితరాలతో పాటు కుటుంబాలు, గృహాలు, ఆర్థిక స్థితిగతులు, ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా కన్వీనర్ కోవ ఇందిరా, వైస్‌చైర్మన్ రాథోడ్ అర్జున్ తదితరులు ఉన్నారు.

కుచిర్యాల గ్రామంలో పర్యటన

బోథ్: మండలంలోని కుచిర్యాల గ్రామంలో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలో గల జగదాంబ దేవి సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, స్వామి, శ్రీనివాస్, సురేందర్, ప్రశాంత్, రూపుచంద్, రవి ఉన్నారు.

సంత.. అసౌకర్యాల చింత

- వేలంలో భారీగా ఆదాయం
- నదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు



బురదనీటిలో కొనసాగుతున్న వాంకిడి వారాంతపు సంత(ఫైల్)

సిర్పూర్(టి): జిల్లాలోని వారసంతలతో ఏటా ఆయా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. కానీ సంతలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలంలో వస్తున్న ఆదాయాన్ని పంచాయతీ అధికారులు ఎలాంటి అభివృద్ధికి వినియోగిస్తున్నారో తెలియడం లేదు. సిర్పూర్(టి), లోనవెల్లి, కౌటాల, చింతలమానెపల్లి, గూడెం, రవీంద్రనగర్, దహెగాం, కొంచవల్లి, పెంచికల్‌పేట్, చేడ్వాయి, బెజ్జూర్, సలుగుపల్లి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్, వాంకిడి, ఇందాని, తిర్యాణిలలో వారసంతలు కొనసాగుతున్నాయి. సిర్పూర్(టి) మండలం హుడ్కిలి, వాంకిడి మండలం గోయగాం, జైనూర్ మండల కేంద్రంతోపాటు కౌటాలలో పశువుల సంతలు నిర్వహిస్తున్నారు. ఈ సంతల నిర్వహణకు వేలం వేయడం ద్వారా ఏటా ఆయా గ్రామ పంచాయతీలకు రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది.

తగ్గుతున్న ఆసక్తి..

వారసంతలతో పాటు పశువుల సంతల్లో సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి వసతులు, సౌకర్యాలు కల్పించడం లేదు. సంతలకు వస్తున్న వినియోగదారుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది. ఆశించిన ఆదాయం రాకపోవడంతో వ్యాపారులు సంతల వేలంలో పాల్గొనేందుకు విముఖత చూపుతున్నారు. ఇటీవల పలు వార సంతల వేలం వాయిదా పడిన విషయం తెలిసిందే. వేలం ద్వారా సమకూరే ఆదాయాన్ని పంచాయతీలో అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆదాయం మరింత పెంచేందుకు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

జిల్లాలో ప్రధానంగా హుడ్కిలి, కౌటాల, గోయెగాం, జైనూర్ గ్రామాల్లో నిర్వహించే పశువుల సంతల వేలంలో పాల్గొనేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. పశువుల సంతల నిర్వహణకు అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాలీలు, వ్యాన్లు, లారీల్లో పశువులు తరలించే క్రమంలో స్థానిక యువకులు, నాయకులు తరుచూ అడ్డుకుంటుండటంతో వ్యాపారులు విముఖత చూపుతున్నారు. పశువుల సంతల నిర్వహణ అధిక భారం కావడంతో సమీపంలోని మహారాష్ట్ర గ్రామాల నుంచి జిల్లా మీదుగా పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. సిర్పూర్(టి)- వెంకట్రావ్‌పేట్, సిర్పూర్(టి)- మాకిడి అంతర్రాష్ట్ర రహదారులతోపాటు గూడెం- అహెరీ, ఆసిఫాబాద్- చంద్రపూర్ జాతీయ రహదారుల ద్వారా దందా నిర్వహిస్తున్నారు. మహారాష్ట్రలోని గ్రామాల్లో కొత్త పశువుల సంతలు కూడా ఏర్పడుతున్నాయి.

సంతలో వసతులు కల్పించాలి



ప్రతీవారం కొనసాగించే వారాంతపు సంతలు, పశువుల సంతల్లో వసతులు, సౌకర్యాలు కల్పించాలి. దూర ప్రాంతాల నుంచి సంతలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– సత్యనారాయణ, సిర్పూర్ (టి)

అధికారులు చర్యలు తీసుకోవాలి



సంతల నిర్వహణ నిబంధనల మేరకు కొనసాగించేలా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. గ్రామపంచాయతీల ఆదాయం పెంచడంతో పాటు సంతల్లో వ్యాపారస్తులకు, వినియోగదారులకు వసతులు, సౌకర్యాలు కల్పించాలి.

– సుర్పం అర్జు, చీలపెల్లి మాజీ సర్పంచ్

కనులపండువగా ఏకాదశ దీక్షలు



భక్తులకు మాలధారణ చేస్తున్న పండితులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 12న హనుమాన్ జయంతి పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 500 మంది భక్తులు ఏకాదశ దీక్షలు స్వీకరించారు. ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ, శ్రీనివాసశర్మ, శేఖర్‌శర్మ, మహేశ్‌శర్మల ఆధ్వర్యంలో గణపతి పూజ, నవగ్రహపూజ, ఆంజనేయస్వామికి రుద్రాభిషేకం, అష్టోత్తర శత నామపూజ అనంతరం దీక్షాపరులకు మాలధారణ కార్యక్రమాన్ని అత్యంత కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం కాషాయమయం కాగా జైశ్రీరాం, జై హనుమాన్ నామస్మరణతో మారుమోగింది. అనంతరం మంగళహారతి, మహామంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా దీక్షాకాలంలో స్వాములు పాటించాల్సిన నియమ నిబంధనలను భక్తులకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండా వెంకన్న, ధర్మపురి వెంకటేశ్వర్లు, పిన్నా వివేక్, ఎకిరాల శ్రీనివాస్, రావుల నారాయణమూర్తి, వనం మధు, లక్ష్మణమూర్తి, గణపతి, రాధాకృష్ణ చారి, ప్రకాశ్‌గౌడ్, దీక్షాస్వాములు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి కృషి చేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సింగల్‌గూడ గ్రామస్తులు

రెబ్బెన: రెబ్బెన పంచాయతీ పరిధిలోని సింగల్‌గూడలో గల సేవాలాల్ గుడి ముందు షెడ్డు నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి షెడ్డు నిర్మాణానికి తోడ్పాటు అందించాలని కోరారు. వారు మాట్లాడుతూ సింగల్‌గూడలో దాదాపు 90శాతం బంజారా లంబాడాలే నివసిస్తున్నారన్నారు. లంబాడాల ఆరాధ్య దైవం సేవాలాల్ గుడి ముందు షెడ్డు లేకపోవడంతో సేవాలాల్ దీక్షలు స్వీకరించిన భక్తులతో పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ఇతర భక్తులు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి సానుకూలంగా స్పందిస్తూ షెడ్డు నిర్మాణం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. మాజీ ఉప సర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, గ్రామస్తులు అజ్మీర రవి, బీఆర్‌ఎస్ నాయకులు అన్నపూర్ణ మురళీగౌడ్, పోతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి కట్టడికి సమష్టిగా పనిచేయాలి

కైలాస్‌నగర్: రాబోయే రెండు నెలల పాటు సమష్టిగా పనిచేస్తూ పట్టణంలో నీటిఎద్దడి లేకుండా చూడాలని ఆదిలాబాద్ మున్సిపల్ ఇంజనీర్ పేరిరాజు అన్నారు. మున్సిపల్ నీటి సరఫరా విభాగంలో పనిచేసే లైన్‌మెన్‌లు, పంప్ ఆపరేటర్లు, లికేజీ గ్యాంగ్‌మెన్‌లతో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.

సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



కెరమెరి: సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న ఆత్రం కుసుంబ్‌రావు



సిర్పూర్(టి): సన్నబియ్యం పంపిణీ చేస్తున్న రేషన్‌డీలర్

కెరమెరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని ఝరి చౌకధరల దుకాణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు మాట్లాడుతూ పేద ప్రజలు కూడా సన్నబియ్యం ఆరగించాలనే సదుద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి సంకల్పించారని, మాటకు కట్టుబడి ఉంటూ అన్ని డీలర్‌షాపుల్లో సన్నబియ్యాన్ని ప్రారంభించారన్నారు. ఇక నుంచి బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ చేయవద్దని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆత్రం లక్ష్మణ్, కుమురం న్యానేశ్వర్ తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండలంలో ప్రారంభించారు. మంగళవారం మండలకేంద్రంలోని పేట్‌మహెలా కాలనీలోని రేషన్ దుకాణంలో తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. మండలంలోని అన్ని రేషన్ దుకాణాల్లో రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేపట్టారు.

విద్యార్థుల అక్రమ అరెస్టులు సరికాదు



పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న తిరుపతి

వాంకిడి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల అక్రమ అరెస్టులు సరికాదని సీపీఐ ఎమ్ఎల్ రెడ్‌స్టార్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగర్ల తిరుపతి అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హెచ్‌సీయూకి సంబంధించిన 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఆక్రమించుకుని వేలానికి సిద్ధమైందని ఆరోపించారు. యూనివర్సిటీ భూములను కాపాడుకునేందుకు వెళ్లిన విద్యార్థులను అరెస్టులు చేయించి, రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరించడం సరికాదని ఖండించారు. అక్రమ విధానాలను విడనాడకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

'ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం'

కాగజ్‌నగర్‌రూరల్: హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టులను ఖండిస్తూ మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను ఎస్ఎఫ్ఐ నాయకులు దహనం చేశారు. ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనివారపు రజనీకాంత్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేయాలని తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడుతుంటే విద్యార్థులను అరెస్టులు చేస్తున్నారన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



కోచింగ్‌సెంటర్ ప్రారంభిస్తున్న కోనేరు కోనప్ప

బెజ్జూర్: విద్యార్థులు, యువతతో పాటు ప్రతిఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలం కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘ భవనంలో చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. కోనేరు కోనప్ప మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గ ప్రజల కోసం ఎల్లప్పుడూ తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఫౌండేషన్ సభ్యులు సురేశ్, కృష్ణ మాట్లాడుతూ చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిర్పూర్ నియోజకవర్గంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కుంటలమానేపల్లి, బెజ్జూర్ మండల కేంద్రంలో కోచింగ్ సెంటర్లు ప్రారంభించామన్నారు. త్వరలో సోమిని, సలుగుపల్లి గ్రామాల్లో కూడా ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, కోనేరు అభిమానులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

ఇచ్చోడ: గోండి ధర్మ గురువు హీరాసుక లింగో జెండాను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రధాన్ పురోహిత్ బోథ్ డివిజన్ మాజీ అధ్యక్షుడు గేడం నగేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్సై తిరుపతికి అందజేశారు. నాయకులు ఉయికే గంగాధర్, గణేశ్, ఉత్తం, శ్రీహరి, అశోక్, శ్రీనివాస్, బళిరాం, జంగుబాబు తదితరులు ఉన్నారు.

నార్నూర్: గోండి ధర్మ గురువు హీరాసుక లింగో జెండాను ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా దేవస్థానం సమీపంలో తగలబెట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రధాన్ సమాజ్ రాంపూర్ గ్రామ పటేల్ సిడం రాంచందర్ డిమాండ్ చేశారు. మంగళవారం గాదిగూడ మండలంలోని రాంపూర్‌లో ప్రధాన్ సమాజ్ ప్రత్యేక సమావేశమై ఘటనపై చర్చించారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆత్రం వామన్, ఆనందరావు, దత్త, పురుషోత్తం, జ్ఞానేశ్వర్, సీతారాం, సంబాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణగోస తీరేదెన్నడో..?

- రోడ్డు నిర్మాణంపై అధికారుల నిర్లక్ష్యం
- పట్టించుకోని పాలకులు



అధ్వానంగా మారిన సీసీరోడ్డు



మట్టి కొట్టుకుపోయి దర్శనమిస్తున్న పైపులు

కెరమెరి: ప్రభుత్వాలు.. పాలకులు మారుతున్నా మండలంలో రోడ్ల దుస్థితి మాత్రం మారడం లేదు. కెరమెరి నుంచి జైనూర్ మండలం పాట్నాపూర్‌లోని శ్రీ సద్గురు పూలాజీబాబా దర్శనానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులతో పాటు దర్శనానికి వెళ్లే భక్తుల తిప్పలు అన్నీఇన్నీ కావు. ఏళ్ల కాలం నుంచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా గంతలు, రాళ్లు, మట్టి దిబ్బల మధ్య ప్రయాణం చేయాల్సి వస్తోంది.

దూరం 5 కి.మీ.. సమయం 40 నిమిషాలు..

జైనూర్ మండలంలోని పాట్నాపూర్‌లో గల శ్రీ సద్గురు పూలాజీబాబా సంస్థాన్‌కు ప్రతీరోజు కెరమెరి నుంచి అనేక మంది భక్తులు వెళ్తుంటారు. కెరమెరి నుంచి మలంగి వరకు రోడ్డు బాగున్నా.. మలంగి నుంచి పాట్నాపూర్ వరకు 5 కిలోమీటర్ల దూరం రోడ్డు అధ్వానంగా ఉంది. ఆ 5 కిలోమీటర్ల దూరం వెళ్లేందుకు 40 నిమిషాల కంటే అధిక సమయం పడుతుందంటే రోడ్డు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రోడ్డుపై ఎక్కడిక్కడ గుంతలు ఉన్నాయి. దారి మధ్యలో గతంలో అర కిలోమీటర్ వరకు నిర్మించిన సీసీరోడ్డుతో పాటు చెరువు వద్ద నిర్మించిన కల్వర్టు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గతంలో కురిసిన భారీ వర్షానికి కల్వర్టు కూలిపోయింది. పైపులపై ఉన్న మట్టి కొట్టుకుపోయింది. రోడ్డంతా కోతకు గురైంది. ఈ మార్గంలో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. రాకపోకలు సాగించే సమయంలో అదుపుతప్పితే కింద లోయలో పడే పరిస్థితులు ఉన్నాయి.

అధికారులు స్పందించాలి



గత కొన్నేళ్లుగా రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. అధికారులు స్పందించి కొత్త రోడ్డు మంజూరు చేయాలి.

– దుర్రె సకారాం, ఆంద్‌గూడ

ధార్మిక్‌నగర్‌లో శబరిమాత భక్తుల పాదయాత్ర

నేరడిగొండ: లోక కళ్యాణార్థం శబరిమాత భక్తులు చేపట్టిన పాదయాత్రకు మండలంలోని ధార్మిక్‌నగర్‌లో తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ స్వాగతం పలికారు. శ్రీరామనవమి పురస్కరించుకొని ఏటా బోథ్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన శబరిమాత భక్తులు పాదయాత్ర నిర్వహిస్తారు. కాలినడకన కామారెడ్డి జిల్లాలోని తాడ్వాయి గ్రామంలో వెలసిన శబరిమాత ఆలయాన్ని దర్శించుకుంటారు. బలరాం జాదవ్ తన స్వగ్రామంలో వారికి పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులు బలరాం జాదవ్ ఇంట్లో కొంతసేపు సేద తీరిన అనంతరం పాదయాత్ర ప్రారంభించారు.

హనుమాన్ మందిరంలో పూజలు

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట హనుమన్ ఆలయంలో ఆదిలాబాద్‌కు చెందిన బాలాజీ మహరాజ్ ఆధ్వర్యంలో హనుమన్ దీక్ష స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలువురు హనుమన్ దీక్ష స్వీకరించారు. తహరే గణేశ్, ఆరెల్లి రాజలింగు, జాదవ్ లఖన్ తదితరులు ఉన్నారు.

మహాబోధి మహావిహార్‌ను బౌద్ధులకు అప్పగించాలి



అంబేడ్కర్ భవన్‌లో సమావేశమైన నాయకులు

సిర్పూర్(టి): బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయా నగరంలో గల సామ్రాట్ అశోక చక్రవర్తి నిర్మించిన మహాబోధి మహావిహార్‌ను బౌద్ధులకు అప్పగించాలని మండల అంబేడ్కర్ సంఘం నాయకులు, భారతీయ బౌద్ధమహాసభ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో గల అంబేడ్కర్ భవన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మహాబోధి మహావిహార్‌ను బౌద్ధులకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న చలో బుద్ధగయా కార్యక్రమం ఉంటుందని, చలో బుద్ధగయా కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏప్రిల్ 4న హైదరాబాద్ పట్టణంలోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు మహార్యాలీ ఉంటుందన్నారు. నాయకులు దుర్గం విక్రమ్, దుర్గం తిరుపతి, నగ్రాడె రాజు, దుర్గం నాందేవ్, సోగల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఇచ్చోడ: రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారు సైతం నేరుగా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీ వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

తాంసి: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఏప్రిల్ 14 వరకు గడువు పెంచిందని ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్‌లో ఆఫ్‌లైన్‌ద్వారాదరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామరక్ష స్తోత్ర పారాయణం



శ్రీరామరక్ష స్తోత్ర పారాయణం చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: శ్రీరామ నవరాత్రుల్లో భాగంగా రెండోరోజు జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణేశ్ మందిర్‌లో మంగళవారం మహిళా భక్తులు శ్రీరామ రక్షస్తోత్ర పారాయణం చేశారు. ఈ సందర్భంగా మహిళలు తాంబూలాలు, పసుపు, కుంకుమలు ఇచ్చిపుచ్చుకున్నారు. మంగళహారతులు నిర్వహించి, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. శ్రీరామరక్ష స్తోత్ర పారాయణం ప్రతీరోజు ఒక ఆలయంలో నిర్వహించనున్నట్లు మహిళలు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.